# సాక్షి
# అన్నమయ్య జిల్లా

గురువారం । 24 । అక్టోబర్ । 2024






**విద్యార్థుల ప్రాణం తీసిన గంజాయి మత్తు**

గంజాయి మత్తు ఇద్దరు విద్యార్థుల ప్రాణం తీసింది. రైల్వే ట్రాక్‌పైకి వెళ్లిన ఇద్దరు విద్యార్థులపై రైలు దూసుకెళ్లింది. ప్రమాదంలో ఇద్దరూ దుర్మరణం చెందారు. - 8లో



**జీవితం చదివేద్దాం.. బతికి సాధిద్దాం**

నేటి యువత క్షణికావేశంతో తల్లిదండ్రుల ఆశలను మధ్యలోనే తుంచి కన్నీళ్లు మిగులుస్తున్నారు. విద్యార్థులు జీవితాన్ని చదవాలి.. బతికి సాధించాలి. - 8లో

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.360 | రూ.440 |
| రెండోరకం | రూ.290 | రూ.356 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 220 మెట్రిక్ టన్నులు



## న్యూస్‌రీల్

### బెటాలియన్‌లో ఓపెన్ హౌస్



బెటాలియన్‌లోని ఆయుధాల పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**సిద్దవటం:** మండలంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ థియోఫిలాస మాట్లాడుతూ బెటాలియన్‌లో ఉన్న ఆయుధాలు, సాంకేతిక పరికరాలను ప్రదర్శించామన్నారు. వాటి పనితీరుపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఆర్.విల్సన్‌కెర్, యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివ్యరాణి, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఏఆర్‌ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగమునిరెడ్డి, భాకరాపేట హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మీకేశమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### కార్తీక మాసానికి ప్రత్యేక బస్సులు

**కడప కోటిరెడ్డిసర్కిల్:** కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నవంబరు 4, 11, 18, 25 తేదీల్లో వివిధ శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. శ్రీశైలం, మహానంది, అరుణాచలం తదితర క్షేత్రాలకు భక్తులు వెళ్లేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పౌర్ణమి సందర్భంగా తిరువన్నామలైలోని అరుణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల, మైదుకూరు డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు సిద్ధం చేశామన్నారు. విహార యాత్రలకు వెళ్లే వారికి అద్దె ప్రాతిపదికన బస్సులు ఇస్తామన్నారు.

# నేనున్నా..

- బాధిత కుటుంబానికి భరోసా కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- బద్వేలు పర్యటనలో జననేతకు జనం అడుగడుగునా నీరాజనం
- అభివాదం చేస్తూ ముందుకు సాగిన జగన్

**బద్వేలు అర్బన్/గోపవరం:** వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధితులకు కొండంత భరోసా కల్పించారు. కూటమి ప్రభుత్వంలో అరాచకం రాజ్యమేలుతోందని.. ఆడబిడ్డలకు రక్షణ కరువైందని మండిపడ్డారు. ఎవరూ అధైర్యపడాల్సిన పని లేదని బాధితులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. బద్వేలు పట్టణంలో ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన దస్తగిరమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు బుధవారం ఆయన బద్వేలుకు వచ్చారు. గోపవరం మండలం పి.పి.కుంట సమీపంలోని హెలీప్యాడ్‌లో దిగిన అనంతరం రోడ్డు మార్గాన బద్వేలుకు చేరుకున్నారు. దారి పొడవునా ప్రజలు, అభిమానులు జననేతను చూసేందుకు ఉత్సాహం చూపారు. ప్రజలు చూపిస్తున్న ప్రేమాభిమానాలతో జగన్‌మోహన్‌రెడ్డి సైతం తన వాహనాన్ని ఆపి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం పట్టణంలోని రామాంజనేయనగర్‌లో ఉన్న దస్తగిరమ్మ ఇంటి వద్దకు చేరుకున్నారు.

**బాధిత కుటుంబానికి కొండంత భరోసా**

దస్తగిరమ్మ ఇంటికి చేరుకున్న జగన్‌మోహన్‌రెడ్డి తొలుత దస్తగిరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యు లను పరామర్శించారు. అనంతరం దస్తగిరమ్మ తల్లిదండ్రులైన హుస్సేనయ్య, హుస్సేనమ్మలతో పాటు మేనమామతో మాట్లాడారు. ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకొని వారిని ఓదార్చారు. తానున్నానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీలు డీసీ గోవిందరెడ్డి, ఆర్.రమేష్‌యాదవ్, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ఆదిత్యరెడ్డి, వైఎస్సార్‌సీపీ నూర్‌బాషా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఓ.రసూల్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ ఆర్టీసీ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, బద్వేలు నియోజక వర్గ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



దస్తగిరమ్మ కుటుంబీకులను పరామర్శిస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



తనను చూసేందుకు వచ్చిన అభిమానులకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

### జనసంద్రం

**బద్వేల్: (వ్యవసాయం):** 'కూటమి ప్రభుత్వంలో అరాచకాలు ఎక్కువయ్యాయి.. ఆడబిడ్డలకు రక్షణ కరువైంది.. ఇక నువ్వే దిక్కు.. జగనన్నా..' అంటూ జనం నినదించారు. దస్తగిరమ్మ కుటుంబ సభ్యులను బుధవారం మాజీ ముఖ్యమంత్రి, వైయస్ జగన్ మోహన్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వైయస్ జగన్ మోహన్ రెడ్డి కాన్వాయ్ అక్కడకు చేరుకునేసరికి రామాజనేయ నగర్ నలువైపుల వీధుల నుంచి జనం తండోపతండాలుగా తరలివచ్చారు. కారులో నుంచి దిగిన జగన్ జనం వైపు చూస్తూ.. అభివాదం చేస్తూ దస్తగిరమ్మ ఇంటిలోకి వెళ్లారు.వారిని పరామర్శించిన అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. నాలుగు నెలల కూటమి పరిపాలనలో ఎన్నో దారుణాలు జరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు పాలనలో ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు.ఆడబిడ్డల రక్షణ కోసం ఏర్పాటు చేసిన దిశ చట్టాన్ని నీరుగార్చడంపై ధ్వజమెత్తారు.

# పనితీరు మెరుగుపరుచుకోవాలి

**రెవిన్యూ అధికారులకు కలెక్టర్ సూచన**

**రాజంపేట:** రెవెన్యూ అధికారులు పనితీరు మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సూచించారు. బుధవారం రాజంపేట బైపాస్ రోడ్డులోని కళాంజలి గార్డెన్స్‌లో డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సేవలలో వేగం, నాణ్యత, పారదర్శకత ముఖ్యమన్నారు. చిత్తశుద్ధితో రెవెన్యూ చట్టాలు, విధులను బాధ్యతగా అమలు చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చూపరాదన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ నైదియాదేవి, సర్వేశాఖ జిల్లా అధికారి భరత్ కుమార్‌తోపాటు తహసీల్దార్లు, డీటీలు, సీనియర్ అసిస్టెంట్లు, మండల సర్వేయర్లు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట డివిజన్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

**విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు**

**రాయచోటి:** విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, పర్యవేక్షకులు, సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలతో క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిసిన నేపథ్యంలో ప్రతిరోజూ సచివాలయ పరిధిలో వైద్య శిబిరాలు, అవగాహన సమావేశాలు నిర్వహించి జ్వరాల సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. డెంగీ కేసు నమోదైన గ్రామాలలో ప్రణాళిక ప్రకారం మూడు వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ప్రతి ఆరోగ్య సూచికలో వందశాతం లక్ష్యాలు సాధించే విధంగా సిబ్బంది, వైద్యులు అంకితభావంతో పనిచేయాలని కోరారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య, ప్రోగ్రామ్ అధికారులు పాల్గొన్నారు.

**రేపటి నుంచి పశుగణన ప్రారంభం**

జిల్లాలో ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పశుగణనకు అన్ని ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం రాయచోటిలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్ పిళ్లైతో కలిసి దేశవ్యాప్తంగా ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే 21వ అఖిల భారత పశుగణనపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఓ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## అంధుల జీవితంలో
# వెలుగు రేఖలు

- అంధుల ఉన్నత పాఠశాలలో విద్యాబోధనకు 75 ఏళ్లు
- ఎందరో అంధులకు అక్షరజ్ఞానం... వారి జీవితాల్లో ఉషోదయాలు
- ఆంధ్రప్రదేశ్‌లోనే కడపలో ఏకైక అంధుల ప్రభుత్వ ఉన్నత పాఠశాల
- 25న వజ్రోత్సవ వేడుకలు



అంధుల పాఠశాల ముఖద్వారం

**కడప ఎడ్యుకేషన్:** అంధులకు అక్షరాలను నేర్పుతూ వారి జీవితంలో వెలుగు రేఖలు నింపుతోంది. 1949లో కడప పట్టణంలో ఒక అంధ ఉపాధ్యాయుడు ఒక అంధ విద్యార్థితో ప్రారంభమైన అంధుల పాఠశాల నేడు ఎంతో ఉన్నతస్థితికి చేరింది. ఈ 75 ఏళ్ల ప్రస్థానంలో ఎందరో జీవితాల్లో వెలుగులను నింపి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దింది. ఈ నేపథ్యంలో ఈ నెల 25న వజ్రోత్సవాల కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు పాఠశాల యాజమాన్యంతోపాటు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పాఠశాలకు రంగులు అద్దడం, ఆవరణాన్ని శుభ్రం చేసి అలకరించే పనిలో సిబ్బంది తలమునకలయ్యారు.

**ఆంధ్రప్రదేశ్‌లో ఏకైక పాఠశాల...**

ఆంధ్రప్రదేశ్‌లో 1949లో ఏకైక ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాల కడప నగరంలోని శంకరాపురంలో ఏర్పాటైయింది. నాటి నుంచి నేటి వరకు 1 నుంచి 10వ తరగతి వరకు అంధ విద్యార్థులకు విద్యాబోధనలను అందిస్తోంది.

### ఓ ప్రధానోపాధ్యాయుడి సహకారంతో...



స్కూలు స్థాపకుడు వెంకటరత్నం

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం(రాజమండ్రి)కి చెందిన వెంకటరత్నం అనే ప్రధానోపాధ్యాయుడు 1949 అక్టోబర్ 25వ తేదీన కడపకు వచ్చారు. ఈ క్రమంలో కడపకు చెందిన కామిశెట్టి వెంకటేశంశెట్టి, ధర్మపత్ని కామిశెట్టి బాలమ్మల సహకారంతో పాఠశాల కోసం ఎకరా 50 సెంట్ల స్థలాన్ని సేకరించి కడప శంకరాపురంలో ఒక చిన్న గుడిసెలో ప్రభుత్వ అంధుల పాఠశాలను స్థాపించారు.

# గమ్యం చేరని ప్రయాణం

- పులివెందుల సమీపంలో లోయలో పడిన ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు
- ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదం



చికిత్స పొందుతున్న కండక్టర్ నీరదామణి



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఆర్డీఓ భానుశ్రీ

**పులివెందుల రూరల్:** మరికొద్ది నిమిషాల్లో వారంతా గమ్యం చేరుకుంటారు. అంతలోనే ఉన్నట్టుండి హాహాకారాలు.. ఏమైందో తెలియలేదు. మెల్లగా తేరుకునే లోపు బస్సు పెద్ద లోయలో పడిపోయి ఉంది. రక్షించే వారి కోసం ప్రయాణికులంతా కేకలు వేస్తున్నారు. అతి వేగం.. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో జరిగిన పొరపాటు.. వెరసి ప్రయాణికుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టేశాయి. వైఎస్సార్ జిల్లా పులివెందుల వద్ద బుధవారం బస్సు లోయలో పడిన సంఘటనలో 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మరికొందరి పరిస్థితి విషమంగా ఉంది. కదిరి నుంచి పులివెందులకు వస్తున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు నామాలగుండు దాటుకొని పురపాలక డంపింగ్ యార్డు సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న దాదాపు 30 అడుగుల లోయలో పడిపోయింది. డీఎస్పీ మురళీ నాయక్, సీఐ జీవన్ గంగానాథ్‌లు క్షతగాత్రులను వెంటనే 108 వాహనం ద్వారా పులివెందుల వైఎస్సార్ సర్వజన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్రైవర్ గంగిరెడ్డి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్టు తెలుస్తోంది. బస్సులోని ప్రయాణికుల్లో కొందరికి చేతులు విరగ్గా, మరి కొందరికి నడుములు విరిగాయి. కండక్టర్ నీరదామణికి నడుము వద్ద ఎక్కువగా నొప్పి ఉండడంతో ఆమెకు చికిత్స చేస్తున్నారు. కదిరికి చెందిన షేక్ షావూర్ జషాకు ఎడమ చేయి విరిగింది. ముదిగుబ్బకు చెందిన వెంకట శివమ్మకు భుజం విరిగింది.

**క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్సీ**

పులివెందుల - కదిరి రోడ్డు మార్గంలో ఆర్టీసీ బస్సు లోయలో పడిన సంఘటన తెలుసుకున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

**మున్సిపల్ చైర్మన్ పరిశీలన**

మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్ కిశోర్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు.

### మెరుగైన వైద్యం అందించండి

బస్సు బోల్తా ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను పులివెందుల ఆర్డీఓ భానుశ్రీ, తహసీల్దార్ నజీర్ అహమ్మద్, ఆర్టీసీ ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి, ఆర్టీసీ డీఎం ప్రవీణ్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు వైఎస్సార్ సర్వజన ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరిని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

### ఎదుర్లగుట్టను పరిశీలించిన అధికారులు



ఎదుర్లగుట్ట ఆక్రమణను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

**బి.కొత్తకోట:** ఎట్టా ఎదుర్లగుట్టకే ఎసరా అన్న శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనంపై జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ స్పందించారు. ఈ కథనంపై చర్యలు తీసుకుని నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ అహ్మద్ అన్సారీని ఆదేశించారు. దీనిపై తహసీల్దార్, ఆర్ఐ రామాంజనేయులు, వీఆర్‌ఓ, సిబ్బంది శీలంవారిపల్లె పంచాయతీలోని ఎదుర్లగుట్ట ఆక్రమణ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. గుట్టను చదును చేసి ఆక్రమించిన భూమి విస్తీర్ణం ఎంతుంటుంది అన్న దానిపై సర్వేయర్, ఆర్‌ఐలు పరిశీలించారు. ఈ ఆక్రమణ భూమికి సంబంధించి సర్వే నంబర్ల వారీగా విస్తీర్ణం, అందులో ఆక్రమణ జరిగిన విస్తీర్ణం, ఇది ఎన్నిక ఎకరాలు అన్నది తేల్చనున్నారు. దీనికి సంబంధించి విచారణ, పరిశీలన పూర్తయ్యాక వివరాలను వెల్లడిస్తామని తహసీల్దార్ తెలిపారు.

### నవంబర్ 11లోపు ఫీజు చెల్లించాలి

**కడప ఎడ్యుకేషన్:** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన నిర్దేశిత ఫీజును నవంబర్ 11వ తేదీ లోపు చెల్లించాలని ఇంటర్మీడియట్ ఆర్‌ఐఓ బండి వెంకటసుబ్బయ్య సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంటర్ ఫీజుకు సంబంధించి ఎలాంటి అపరాధ రుసుం లేకుండా నవంబర్ 11లోపు చెల్లించవచ్చని తెలిపారు. అపరాధ రుసుము రూ.1000 తో నవంబర్ 12 నుంచి నవంబర్ 20 వరకు చెల్లించవచ్చని చెప్పారు. ఆ తరువాత ఎలాంటి పొడిగింపు ఉండదని ఆయన తెలిపారు.

# అన్నదాతపై నిర్లక్ష్యమేల!

- కరువు మండలాలు ప్రకటించాలి
- ముంపు భూముల్ని దాల్మియా కొనాలి
- అన్నమయ్య డ్యాం పనులు ప్రారంభించాలి
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ జేష్టాది శారద



హాజరైన జెడ్పీటీసీలు, జిల్లా అధికారులు

**కడప సెవెన్‌రోడ్స్:** ఖరీఫ్‌లో కరువు, ఇటీవల తుఫాను కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం సరికాదని.. అన్నదాతలను ఆదుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. కరువు మండలాలను ప్రకటించి అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జేష్టాది శారద అధ్యక్షతన జెడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది.

- వ్యవసాయశాఖపై జరిగిన సమీక్షలో సీకే దిన్నె జెడ్పీటీసీ రామాంజులరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద నిధులు విడుదల చేసిందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 20 వేలు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ మొత్తంలో కేంద్ర వాటా ఎంతో, రాష్ట్ర వాటా ఎంతో తెలపాలన్నారు. దీనికి జేడీఏ నాగేశ్వరరావు బదులిస్తూ విధి విధానాలు తయారవుతున్నాయని చెప్పారు. నవంబరులో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టి అన్నదాత సుఖీభవ కింద నిధులు విడుదల చేస్తామని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తెలిపారు.



జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి



ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

- ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ విత్తనాల కంటే బహిరంగ మార్కెట్‌లోనే ధర తక్కువ ఉందని, ఇందువల్ల రైతులు నష్టపోయారని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి విమర్శించారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తక్కువ ధరతో సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.



ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

- తుపానులో వరి పంట దెబ్బతిందని, ఎన్యుమరేషన్ చేయించి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇప్పించాలని వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి కోరారు.
- వ్యవసాయాధికారులు గ్రామాలకు వెళ్లడం లేదని, జీలుగ, పిల్లపెసర, శనగ విత్తనాలు ప్రభుత్వం ఎన్ని సరఫరా చేసిందన్న విషయాలను తమకు ఎందుకు తెలుపడం లేదని ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి ప్రశ్నించారు. రబీలో రైతులు సాగు చేసుకోవడానికి శనగ విత్తనాలు సరఫరా చేయాలని ఆయన కోరారు. యూరియా, పాస్ఫేట్ అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు.



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

- పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ మాట్లాడుతూ దెబ్బతిన్న మినుము ఇతర పంటలకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. సబ్సిడీ విత్తనాల సరఫరాతోపాటు నష్టపోయిన ఉల్లి రైతులను ఆదుకోవాలని వీఎన్ పల్లె ఎంపీపీ రఘునాథరెడ్డి కోరారు.
- ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ ప్యాక్ హౌస్‌లు, ఫాంపాండ్స్, కలెక్షన్ సెంటర్లకు సంబంధించిన డబ్బులను రైతుల అకౌంట్లలో జమ చేయాలని కోరారు. చక్రాయపేట జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డితోపాటు మరికొందరు సభ్యులు కరువు మండలాల ప్రకటన అంశాన్ని లేవనెత్తారు. ఇందుకు అధికారులు బదులిస్తూ ఐదు పారా మీటర్లలో మూడు అనుకూలిస్తే కరువు మండలాలను విపత్తుల నిర్వహణ విభాగం ప్రకటిస్తుందన్నారు. అన్నమయ్య జిల్లాలో 19-20 మండలాలు కరువు కింద ప్రకటించే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు మండలం తాళ్లమాపురంలో చేనేత కార్మికులు లేకపోయినా 50 మంది పెన్షన్ పొందుతున్నారని పేర్కొన్నారు.

### ఉచిత కంటి అద్దాలు ఏవీ!

వైద్య ఆరోగ్యశాఖపై జరిగిన చర్చలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ ఎల్వీప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ కాంట్రాక్టు ఇచ్చిన తర్వాత పేదలకు ఉచిత కంటి అద్దాలు ఇవ్వడం లేదని తెలిపారు. ఆస్పత్రుల్లో అప్తామాలజిస్టుల కొరత తీవ్రంగా ఉందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రాత్రి వేళల్లో వైద్య సిబ్బంది విధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆకేపాటి కోరారు. మధ్యాహ్నానికే పీహెచ్‌సీవైద్యులు ఇళ్లకు వెళ్లిపోతున్నారని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తెలిపారు. డెలివరీ కేసులను ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేయడం వల్ల ఒక్కో కాన్పుకు రూ. 40-50 వేలు ఖర్చవుతోందన్నారు. పీహెచ్‌సీల్లో కాన్పుల సంఖ్య పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

- ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య డ్యాం తెగిపోవడం వల్ల రాయచోటి, రాజంపేట, కోడూరు నియోజకవర్గాల ప్రజలకు తాగు, సాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, వెంటనే పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అంశంపై సమావేశంలో తీర్మానం ఆమోదించి ప్రభుత్వానికి పంపాలని కోరారు.



ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

### ఎంఎస్‌ఎంఈ తరలింపు అన్యాయమే!

కొప్పర్తిలోని ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను అమరావతికి తరలించిన అంశాన్ని సీకే దిన్నె జెడ్పీటీసీ రామాంజులరెడ్డి ప్రస్తావించారు. ఇందుకు పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ చాన్‌బాష బదులిస్తూ తరలింపుపై జారీ చేసిన జీఓలో కారణాలు పేర్కొనలేదని తెలిపారు. తొలుత ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్ గుంటూరుకు మంజూరైందని, భూమి లేకపోవడంతో కడపలో ఏర్పాటు చేశారన్నారు. ఇప్పుడు దాన్ని అమరావతికి తీసుకు వెళ్లారని చెప్పారు. దీనిపై జెడ్పీటీసీ స్పందిస్తూ ఒకప్రాంతానికి ఒకసారి మంజూరు చేసిన ప్రాజెక్టును ఇతర ప్రాంతాలకు తరలించడం అన్యాయం కాదా? అంటూ ప్రశ్నించగా, పరిశ్రమలశాఖ జీఎం అవునని సమాధానమిచ్చారు. దీంతో ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి జీఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అన్యాయమంటూ ఓ అధికారిగా ఎలా మాట్లాడుతారంటూ నిలదీశారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్, అన్నమయ్య జిల్లా డీఆర్వో సత్యనారాయణ, జెడ్పీ డిప్యూటీ సీఈఓ మైథిలి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి

- ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ మైలవరం మండలంలో దాల్మియా యాజమాన్యం వరద ప్రవాహానికి అడ్డంగా ఫ్యాక్టరీ నిర్మించిన కారణంగా వర్షాకాలంలో నీరు రైతుల పొలాలను ముంచెత్తుతోందన్నారు. దాల్మిక యాజమాన్యంతో అధికారులు కుమ్మక్కైన ఫలితంగా రైతులు నష్టపోవాల్సి వస్తోందన్నారు. ముంపునకు గురవుతున్న సుమారు 600 ఎకరాల రైతుల పొలాలను దాల్మియా యాజమాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## క్లుప్తంగా

### కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

మదనపల్లె: కారు ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం ములకలచెరువు మండలంలో చోటుచేసుకుంది. గుడుపల్లి గ్రామానికి చెందిన వెంకటస్వామి కుమారుడు క్రిష్టప్ప (58) స్థానికంగా లాండ్రీ షాపు నిర్వహిస్తున్నాడు. మధ్యాహ్నం ఇస్త్రీ చేసిన దుస్తులను మెయిన్ రోడ్డుకు అటువైపు ఉన్న వ్యక్తికి అందజేసి తిరిగి రోడ్డు దాటుతుండగా వెనుకనుంచి వేగంగా వచ్చి కారు ఢీకొంది. ప్రమాదంలో క్రిష్టప్ప తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులతో కలిసి బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో ములకలచెరువు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

### మనస్థాపంతో మహిళ ఆత్మహత్య



మృతి చెందిన మహిళ

మదనపల్లె: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ భారం, భర్త లేకపోవడంతో మనస్థాపం చెందిన మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. కోళ్లబైలు పంచాయతీ జగన్‌కాలనీకి చెందిన స్వాతి (35) తన తల్లి, ఇద్దరు పిల్లలతో కలిసి అద్దె ఇంట్లో ఉంటోంది. 13 సంవత్సరాల క్రితమే ఆమెను భర్త వదలి వెళ్లిపోవడంతో బెంగళూరు బస్టాండులో తమలపాకుల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ క్రమంలో కుటుంబ పోషణ, వ్యాపార నిమిత్తం పలువురి వద్ద అప్పులు చేసింది. ఇటీవల రుణదాతల నుంచి ఒత్తిడి అధికం కావడం, కుటుంబం పోషణభారం కావడం, మగతోడు లేని సంసారం నెట్టుకురాలేక మనస్థాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్కూలుకు వెళ్లిన పిల్లలు ఇంటికి తిరిగి వచ్చి చూడగా తల్లి ఉరికి వేలాడుతుండటంతో గట్టిగా కేకలు వేశారు. చుట్టూ పక్కల వాళ్లు అక్కడికి వచ్చి తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని చేరుకున్న సీఐ కళా వెంకటరమణ స్థానికుల సహాయం మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

### చేయికోసుకున్న విద్యార్థి



చికిత్స పొందుతున్న అగ్రీ విద్యార్థి

కురబలకోట: మండలంలోని అగ్రికల్చర్ కళాశాల విద్యార్థి ఒకరు ప్రేమ వ్యవహారంలో చేయి కోసుకుని మంగళవారం అర్ధరాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసుల కథనం మేరకు.. గుర్రంకొండకు చెందిన రాఘువేంద్ర మండలంలోని అగ్రికల్చర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రాఘవేంద్ర అదే కళాశాలలో చదువుతున్న విద్యార్థినిని ఇష్టపడ్డాడు. ఇది వన్ సైడ్ లవ్‌గా చెబుతున్నారు. ఆమెకు ఈ విషయం తెలీదు. ఈ క్రమంలో సదరు విద్యార్థిని సెలవులో ఊరు వెళ్లింది. ఆమెను చూడకుండా ఉండలేకపోతున్నానంటూ కళాశాల పక్కకు వెళ్లి చాకుతో చేయి కోసుకున్నాడు. సహ విద్యార్థులు వెంటనే రాఘవేంద్రను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### వ్యక్తి అదృశ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగర పరిధిలో ఆర్కేనగర్‌కు చెందిన సుబ్బారావు అదృశ్యమైనట్లు రిమ్స్ ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఎండీహెచ్ షోరూంలో స్టోర్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న సుబ్బారావు ఈనెల 22వ తేదీన రోజులాగా విధులకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని తెలిపారు. రిమ్స్ పోలీసు స్టేషన్ భార్య ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# జీవితం చదివేద్దాం.. బతికి సాధిద్దాం

- తరగతులు, వసతిగృహాల్లో ఇమడలేకపోతున్న విద్యార్థులు
- తల్లిదండ్రులూ ముందు జాగ్రత్తలు తీసుకోండి

**మన తాతలు, తండ్రులు అక్షరం ముక్క చదవకపోయినా జీవించారు. రెక్కల కష్టంతోనే ఐదుగురు నుంచి పది మంది పిల్లలను పెంచి పోషించారు. ఇప్పుడున్న వసతులు, సాంకేతికత, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అప్పుడు లేవు. ఇప్పుడున్న యువత చదువు అర్థం కాకపోయినా, ఫెయిలైనా ఒత్తిడికి లోనై ప్రాణాలు తీసుకుంటున్నారు. క్షణికావేశంతో తల్లిదండ్రుల ఆశలను మధ్యలోనే తుంచి కన్నీళ్లు మిగులుస్తున్నారు. విద్యార్థులు జీవితాన్ని చదవాలి..బతికి సాధించాలి.**



ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన విద్యార్థినిని పరామర్శిస్తున్న డీఈఓ (ఫైల్ )

| | |
|---|---|
| జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలు | 1,734 |
| ప్రాథమికోన్నత పాఠశాలలు | 162 |
| ఉన్నత పాఠశాలలు | 304 |
| సంక్షేమ వసతి గృహాలు | 55 |
| కేజీబీవీలు | 22 |

మదనపల్లె సిటీ: మదనపల్లె నియోజకవర్గం రామసముద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థిని స్వప్న హాస్టల్‌లో చదువుకోనని తీవ్ర ఒత్తిడి లోనై పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నంకు పాల్పడింది. మదనపల్లె సమీపంలోని ముదివేడు కేజీబీవీ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు మాత్రలు మింగి ఆత్మహత్యయత్నంకు పాల్పడ్డారు. పాఠశాలలో రాత్రి చాలా సేపు మేలుకుని చదువుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని, తల్లిదండ్రులకు దూరంగా ఉన్నామనే బెంగతో ఈ సంఘటన చోటు చేసుకుంది. జిల్లాలో ఇలాంటి సంఘటనలు నిత్యం చోటు చేసుకుంటున్నాయి.

**పిల్లలే తమ సర్వస్వమని..**

పిల్లలే తమ సర్వస్వమని, వారు ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. సంపాదనలో అధిక భాగం విద్య కోసమే ఖర్చు పెడుతుంటారు. ఇదే సమయంలో ఇతర కుటుంబాల పిల్లలతో పోలుస్తుంటారు. ఇది మంచిది కాదు. ఇలా చేయడం వల్ల వారిలో ఆత్మన్యూనత భావం పెరుగుతుంది. చదువు పేరుతో నిరంతరం ఒత్తిడికి గురి చేయరాదు. ఉద్యోగం, ఇంటి బాధ్యతలు ఉన్నా పిల్లలతో రోజుకు గంట అయినా ఆప్యాయంగా మాట్లాడాలి. అప్పుడే వారిలో మానసిక పరిపక్వత కలుగుతుంది. నలుగులలో ధైర్యంగా మాట్లాడగలుగుతారు. ఏది మంచో, ఏది చెడో తెలుసుకుంటారు. సమాజంలో ఎలా జీవించాలో , నలుగురితో ఎలా నడుచుకోవాలో నేర్చుకుంటారు. ఏదైనా సమస్య వస్తే నేరుగా తల్లిదండ్రులతో చెప్పుకునేలా అవకాశం కల్పించాలని విద్యావేత్తలు, మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

**ఒత్తిడి భరించలేకనే..**

ప్రస్తుతం అన్ని రంగాల్లో తీవ్రమైన పోటీ నెలకొంది. దీంతో ప్రతి ఒక్కరూ కాలంతో పాటు పరుగులు తీయాల్సి వస్తోంది. ముఖ్యంగా విద్యా వ్యవస్థలో ఈ ధోరణి ఎక్కువగానే ఉంది. మంచి మార్కులు, ర్యాంకులు వస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందనే భావనతో అందరూ ఉన్నారు. ఈ నేపథ్యంలో పిల్లలపై ఒత్తిడి తెస్తున్నారు. ఇంట్లో ఉండి పిల్లలు తరగతి గదులు, వసతి గృహాల్లో ఇమడలేకపోతున్నారు. చిన్న సమస్యకే తల్లడిల్లిపోతున్నారు. ఒక్కోసారి జీవితంపై విరక్తి చెంది కఠిన నిర్ణయాలు తీసుకుంటూ తల్లిదండ్రులకు శోకాన్ని మిగిల్చుతున్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లల విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మానసిక నిపుణులు,విద్యావేత్తలు చెబుతున్నారు.

**భరోసా కల్పించాలి**

గ్రామీణ విద్యార్థులు ఎక్కువ శాతం తెలుగు మాధ్యమంలో చదువుతుంటారు. ఇంటర్‌లోకి వచ్చే సరికి ఆంగ్ల మాధ్యమం ఎంచుకుంటున్నారు. భవిష్యత్తులో తెలుగులో కంటే ఇంగ్లీషు మాధ్యమం చదివిన వారికే అవకాశాలు ఉంటాయనే అపోహతో ఇంగ్లీషు విద్యను అభ్యసిస్తున్నారు. ఒకేసారి భాషాపరమైన ఒత్తిడి, పోటీని తట్టుకుని నిలబాడాలనే ఉద్దేశంతో శక్తికి మించి కష్టపడుతూ కుంగుబాటుకులోనై ప్రాణాలు తీసుకుంటున్నారు. మొదటి సారి ఇంగ్లీషు మీడియంలో వచ్చిన పిల్లలను దృష్టిలో ఉంచుకొని వారికి అర్థమయ్యేలా చెప్పాల్సిన బాధ్యత కళాశాల యాజమాన్యాలపై ఉంది.

**వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించాలి**

ఫీజుల వసూళ్లపైనే దృష్టి ఉంచకుండా చదువులో వెనుకబడిన పిల్లలను ప్రోత్సహించాలి. మానసిక వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించి ఆత్మస్థైర్యం పెంపొందించాలి. విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు జరిపి విద్యార్థుల సమస్యలు తెలుసుకుని భరోసా కల్పించాలి.

**చదువు జీవితంలో ఒక భాగం**



చదువు అనేది జీవితంలో ఒక భాగం మాత్రమే. చదువు రాకపోతే బతకలేమనేది అవాస్తవం. ఆత్మహత్య చేసుకునే ముందు విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు చేసుకోవాలి. అమ్మానాన్న,అధ్యాపకులు కూడా పిల్లలు ఏ రంగాల్లో రాణిస్తారో గుర్తించి, అందులో వారిని ప్రోత్సహించాలి. విద్యార్థుల ప్రవర్తన, కదలికలను అనుక్షణం గమనించాలి. ఇప్పుడున్న యువరరరరత క్షణికావేశానికి లోనవుతున్నారు. వారిని ముందే గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తే ఫలితం ఉంటుంది.

-చాముండేశ్వరి, మానసిక నిపుణులు, మదనపల్లె

### ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడిన నిందితులు, దుంగలను చూపుతున్న అటవీశాఖ అధికారులు

సుండుపల్లె: అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకొని ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు సానిపాయి ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి ముడుంపాడు బీట్, రాయవరం అటవీ ప్రాంతంలో సానిపాయి అటవీ సిబ్బంది దాడులు నిర్వహించి ఐదుగురిని అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్ద ఉన్న ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ అడవుల సంరక్షణ మనందరి బాధ్యతని, ఎవరికైనా కొత్త వ్యక్తులు అటవీ ప్రాంతంలో ప్రవేశించినట్లైతే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డీవైఆర్‌ఓ రమేష్ బాబు, ఎఫ్‌బీఓ అంజనీ స్వాతీ, లీలా లహరి పాల్గొన్నారు.

### మహిళ మృతి కేసులో శిక్ష, జరిమానా

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం బుడ్డాయపల్లెలో ఓ అద్దె ఇంటిలో నివాసముంటున్న తిరుపతికి చెందిన ఓ మహిళ మృతికి కారణమైన వ్యక్తికి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌కుమార్ ఏడు సంవత్సరాల జైలుశిక్ష, రూ. 5 వేలు జరిమానా విధించినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో చిత్తూరు జిల్లా వి.కోట మండలం ఎల్లగరం గ్రామానికి చెందిన వెంకటేశ్‌ను నిందితుడిగా పేర్కొంటూ న్యాయమూర్తి తీర్పునిచ్చారన్నారు.

## కూటమి పాలనలో దళితులకు రక్షణ కరువు



టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన బాధితుడిని పరామర్శిస్తున్న ఆకేపాటి

రాజంపేట టౌన్ : కూటమి ప్రభుత్వంలో దళితులకు రక్షణ కరవైందని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఓబులవారిపల్లె మండలం పి.కమ్మపల్లె హరిజనవాడకు చెందిన పంట నరసింహులు, కృష్ణయ్య, మడగలం ప్రభుదాస్‌లపై ఇటీవల అక్కడి టీడీపీ నాయకులు దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచారు. దాడిలో గాయపడ్డ నరసింహులు, కృష్ణయ్యలు రాజంపేట ప్రభుత్వం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని బుధవారం ఎమ్మెల్యే ఆకేపాటి పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. దాడి కారుకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. బాధితులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ధైర్యం పలికారు. రాష్ట్రంలో దళితులు, విద్యార్థినులు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు. అన్యాయాన్ని ప్రశ్నిస్తాననే పవన్ కల్యాణ్ రాష్ట్రంలో జరుగుతున్న దారుణలపై ఎందుకు నోరు విప్పడం లేదని ఆకేపాటి ఎద్దేవా చేశారు. ప్రభుత్వం రాష్ట్రంలో అరాచకాలను అరికట్టకపోతే పోరాటాలు తప్పవని హెచ్చరించారు.

## ఎన్‌ఆర్‌పురానికి తాకిన సోమశిల బ్యాక్ వాటర్

పది గ్రామాలకు రహదారి కష్టాలు



సోమశిల బ్యాక్ వాటర్

పెనగలూరు: మండలంలోని ఎన్ఆర్‌పురం సమీపంలో ఉన్న గుంజన నదికి సోమశిల బ్యాక్ వాటర్ చేరింది. ఇటీవల తుపాను కారణంగా పెన్నానది ఉధృతంగా ప్రవహించడంతో సోమశిల బ్యాక్ వాటర్ పెనగలూరు మండలానికి తాకాయి. అసలే కరువుతో అల్లాడుతున్న మండల వాసులకు పది గ్రామాలకు పైగా సోమశిల బ్యాక్ వాటర్ కాపాడుతుంది. చుక్కాయిపల్లి, సిరివరం వాసులు పెనగలూరు నుంచి వారివారి గ్రామాలకు వెళ్లాలంటే ఎన్ఆర్‌పురం మీదుగా ఎనిమిది కిలోమీటర్లు మాత్రమే ప్రయాణం చేసేవారు. సోమశిల బ్యాక్ వాటర్ రావడంతో దాదాపు 20 కిలోమీటర్ల మేర ప్రయాణం చేసి గమ్యాన్ని చేరుకోవాల్సి వస్తుంది. అలాగే సిరివరం, తిరుణంపల్లి, రెడ్డివారిపల్లి, ఉప్పరపల్లి, ఎల్‌బి అగ్రహారం, విఎం పురం తదితర గ్రామాల ప్రజలు తిరుణంపల్లి మీదుగా గుంజన నది నుంచి పెనగలూరుకు వచ్చేవారు. అలాగే తిరుణంపల్లి, సిరివరం, రెడ్డివారిపల్లి గ్రామాల ప్రజలకు గుంజన నదికి ఇవతల భాగానా పెనగలూరు వైపున సాగునీటి పొలాలు ఉన్నాయి. గతంలో గుంజన నది మీదుగా వాహనాలు ద్వారా వచ్చేవారు. ఈ సోమశిల బ్యాక్ వాటర్ రావడంతో ఇటు పొలాలకు, అటు మండల కేంద్రాలకు వాహనాలలో రావాలంటే కనీసం 20 కిలోమీటర్లు మేర ప్రయాణించాల్సి వస్తుంది. ఏది ఏమైనా సోమశిల బ్యాక్ వాటర్ పెనగలూరు మండలం గుంజన నదికి సాగడంతో భూగర్భజలాలు పెరిగి మోటార్లలో నీటి శాతం పెరగనున్నట్లు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## 'జనావాసాల మధ్య మద్యం దుకాణాలు వద్దు'



మద్యం దుకాణం ఎదుట నిరసన తెలుపుతున్న స్థానికులు, సీఐటీయూ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్: పట్టణంలోని ఒంటేలు సిద్దయ్య కాంప్లెక్స్, సాయిడిగ్రీ కాలేజ్, ఎస్వీ కాలేజ్, ప్రభుత్వ మేయిన్ స్కూల్, జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన తిరుమల వైన్స్‌ను తొలగించి లైసెన్స్ రద్దు చేయాలని బుధవారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మద్యం దుకాణం తొలగించాలన్న డిమాండ్‌తో స్థానికులతో కలసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణం వల్ల వేలాది మంది విద్యార్థులు, మహిళలు ఎంతో మంది ఇబ్బందులకు గురయ్యారని పేర్కొన్నారు. ఇంత మందిని ఇబ్బందులకు గురిచేస్తున్న మద్యం దుకాణలకు ఎన్టీఆర్, చంద్రబాబు పేర్లు పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాన్‌ప్రసాద్, ముత్యాలకిషోర్, అమర్, మహిళలు పెద్దెత్తున పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రాణం తీసిన 'గంజాయి' మత్తు



యాసిన్ (ఫైల్)



కిరణ్‌కుమార్ (ఫైల్)

పీలేరు రూరల్ : గంజాయి మత్తు ఇద్దరు విద్యార్థుల ప్రాణం తీసింది. మత్తులో ఏమి చేస్తున్నామో తెలియక రైల్వే ట్రాక్‌లోకి వెళ్లిని ఇద్దరు విద్యార్థులపై నాగర్ కోయిల్ - ముంబాయి ఎక్స్‌ప్రెస్ రైలు దూసుకెళ్లింది. ప్రమాదంలో ఇద్దరూ దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళితే... పీలేరు పట్టణం ఎస్‌కేడీ నగర్‌కు చెందిన కె. శ్రీనివాసులు కుమారుడు కిరణ్ కుమార్ (19) తిరుపతిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. పద్మావతి నగర్‌కు చెందిన షరఫ్ అలి కుమారుడు యాసిన్ (17) పీలేరు పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కిరణ్‌కుమార్, యాసిన్ ఇద్దరూ స్నేహితులు. గంజాయి మత్తుకు అలవాటు పడ్డారు. మంగళవారం రాత్రి రాజీవ్‌నగర్ కాలనీ వద్ద గంజాయి సేవించి మత్తులో రైల్వే ట్రాక్‌పైకి వెళ్లారు. రాత్రి 10.30 గంటల సమయంలో నాగర్ కోయిల్ నుంచి ముంబాయి వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు వీరిద్దరిపై దూసుకెళ్లింది. గమనించి పైలట్ స్థానిక ఎల్‌బీఎస్ రోడ్డు రైల్వేగేటు వద్ద సిబ్బందికి సమాచారం ఇచ్చి వెళ్లాడు. సిబ్బంది వెంటనే అక్కడికి వెళ్లి చూడగా యాసిన్ అక్కడికక్కడే మృతి చెందినట్లు గుర్తించారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న కిరణ్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న కదిరి రైల్వే ఎస్ఐ రహీమ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సమాజ శ్రేయస్సే ముఖ్యం



కంటి వైద్యశాలను ప్రారంభిస్తున్న సీఎంఓ సాయి రమేష్

కమలాపురం: తమ పరిశ్రమ కేవలం వ్యాపారం మాత్రమే చేయడం లేదని, దానితో పాటు సమాజ శ్రేయస్సే ముఖ్యం అని, సమాజ సేవ పట్ల అంకిత భావంతో పని చేస్తున్నామని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) సీఎంఓ సాయి రమేష్ తెలిపారు. బుధవారం స్థానిక క్రాస్ రోడ్డు వద్ద బీసీసీపీఎల్ ఆర్థిక సహకారంతో పుష్పగిరి కంటి ఆసుపత్రి పర్యవేక్షణలో నిర్వహించిన కంటి వైద్యశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా ఇప్పటికే పలు చోట బస్ షెల్టర్లు, శుద్ధి నీటి కేంద్రాలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, డయాలసిస్, హిమో డయాలసిస్ సెంటర్లు, మరుగుదొడ్లు తదితరవి ఏర్పాటు చేశామన్నారు. అలాగే దత్తత గ్రామాల్లోని పాఠశాలల్లో ఫర్నీచర్‌తో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు మెరుగు పరిచామన్నారు.మండల ప్రజలు కంటి వైద్యశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ చీఫ్ మేనేజర్లు గోపాల్‌రెడ్డి,పేర్ల భార్గవ్ రెడ్డి, సీఎస్ఆర్ నీతేశ్వర్, పుష్పగిరి కంటి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### సాహితీ వేత్త విద్వాన్ భాస్కర్ రాజు మృతి

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన ప్రముఖ సాహితీ వేత్త విద్వాన్ భాస్కర్ రాజు (78) బుధవారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన తెలుగు పండితునిగా 35 సంవత్సరాలు పలు ప్రాంతాల్లో పనిచేసి 2010లో పదవీ విరమణ చేశారు. పద్య కవిగా పలు సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొని అందరి మన్ననలు పొందారు. తబలా వాయించడం అభిరుచి కలిగిన ఆయన పలు హరికథలకు తబలా సహకారం అందించారు. రామలింగ శతకం, కవితా వినపం తదితర కవిత సంకలనాలను వెలువరించారు. ఈయనకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

చక్రాయపేట: మండలంలోని కుమార్లకాల్వ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కమలమ్మ(62)మృతి చెందినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా.. కుమార్లకాల్వ హరిజనవాడకు చెందిన కమలమ్మ వేంపల్లెలోని తన కూతురు వద్దకు వెళ్లటానికి రోడ్డుపైకి వచ్చింది. ఆ సమయంలో వేంపల్లె వైపునకు టీవీఎస్ ఎక్సెల్ వాహనంలో వెళుతున్న ఓ వ్యక్తిని లిఫ్ట్ అడిగి ఎక్కింది. కొద్ది దూరం వెళ్లే సరికి ఆటో వచ్చి స్కూటర్‌ను ఢీకొట్టడంతో కమలమ్మ కిందపడి తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను వేంపల్లె వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లగానే ఆమె మృతి చెందింది. మృతురాలి భర్త జయన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### వేర్వేరు ఘటనలపై కేసులు నమోదు

గాలివీడు : మండలంలోని నూలివీడు పంచాయతీ ఆవులరెడ్డివారిపల్లెకు చెందిన దేరంగుల ప్రమీల అస్తి తగాదాల విషయమై తన మామ చిన్నప్ప వారి బంధువులు ఐదుగురు కలసి తనను విచక్షణా రహితంగా కొట్టి గాయపరిచారని ఫిర్యాదు చేసింది. అలానే గోరాన్ చెరువు పంచాయతీ ఆవుల శెట్టివారిపల్లెకు చెందిన మౌనిక తన కుమారుడితో కలసి మంగళవారం నుంచి కనబడలేదని భర్త మల్లేష్ ఫిర్యాదు చేయగాపై రెండు ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

### గువ్వలచెరువు ఘాట్‌లో ఆయిల్ ట్యాంకర్ బోల్తా

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె మండలంలోని గువ్వల చెరువు ఘాట్ నాలుగో మలుపు వద్ద ప్రమాదవశాత్తు ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడింది. బుధవారం సాయంత్రం కడప వైపు వస్తూ ఆయిల్ ట్యాంకర్ (ఏపీ03 టీఈ9539) అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో డ్రైవర్ ప్రకాష్‌కు స్వల్పంగా, క్లీనర్ కుమారన్ కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన చింతకొమ్మదిన్నె పోలీసులు స్పందించారు. ఆయిల్ ట్యాంకర్‌కు ప్రమాదం జరగకుండా అగ్నిమాపక శకటాన్ని తెప్పించి బందోబస్తు నిర్వహించారు.



